క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల(సిద్దిపేట): తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు గాయపడిన సంఘటన మండల పరిధిలోని తాడూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్లకొండ రంగయ్య గీత కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీ లాగాగే ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రంగయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం సభ్యులు కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలోని శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే అన్నదానం కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, యాదగిరి, లక్ష్మణ్, చందు, చిన్నా, హరి, సుధాకర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం


మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇచ్చిన ప్రతి హామీలను నిలబెట్టుకుంటామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మజార్ మల్లిక్, సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, యూత్ కాంగ్రెస్ నాయకులు బైరి సాయి, అయ్యుబ్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి చెందిన నర్సయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 20 వేల చెక్కును సోమవారం సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జగన్, నాయకులు మహేందర్, శ్రీధర్, నర్సింహులు, బాబా, సుధాకర్, అజయ్, బాల్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాలతో ఐకమత్యం పెంపు


మాట్లాడుతున్న బాలగంగాధర శాస్త్రీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అందరం కలిసి ఒకే చోట సామూహిక భోజనాలు చేయడం ద్వారా ఐకమత్యం పెంపొందుతుందని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బాల గంగాధర శాస్త్రీ అన్నారు. కార్తీక మాసం సందర్భంగా అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సోమవనజ ఆధ్వర్యంలో ఉమాపార్థీశ్వర కోటి లింగేశ్వర ఆలయంలో కార్తీక వన సాముహిక భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మారాములు, అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అడ్వైజర్ రాజేంద్రప్రసాద్, వైకుంఠం, అంజయ్య, అంతయ్య, దక్షిణామూర్తి, రాజేశ్వర్ రెడ్డి, బాలచంద్రం, శివకుమార్, రామచంద్రం , తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుబ్బాకరూరల్: మండలంలోని ఆకారం, రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి, ధర్మాజీపేట, బొప్పాపూర్, ఎనగుర్తి గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


అక్కన్నపేటలో ప్రమాదకరంగా మలుపు

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. వారంలో ఒకటి, రెండు ప్రమాదాలు ఇక్కడ జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కారు బోల్తా పడి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా గతంలో పలు సంఘటనల్లో ఒకరిద్దరూ మరణించారు. అక్కన్నపేట మీదుగా జనగామ జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారి కావడం.. కనీసం హెచ్చరికబోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కనిపించేలా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)


నిర్మాణంలో కేజీబీవీ భవనం

ఎన్నాళ్లు నిర్మిస్తారు..?

మండల కేంద్రంలో నిర్మిస్తున్న కేజీబీవీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. భవన నిర్మాణానికి రూ. 3.20 కోట్ల వ్యయంతో 2021లో శంకుస్థాపన చేశారు. దాదాపు రెండేళ్లు కావొస్తున్న నిర్మాణ పనులు పూర్తి కాలేదు. అద్దె భవనంలో సరైన సౌకర్యాలు లేకపోయినా నెట్టుకొస్తున్నామంటూ ఉపాధ్యాయులు చెబుతున్నారు. అదేవిధంగా అద్దె భవనంలో సామర్థ్యానికి మించి విద్యార్థుల సంఖ్య ఉందని, త్వరగా సొంత భవనం పూర్తయితే విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలు అందుబాటులో వస్తాయని చెబుతున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)

7న కార్తీక దీపోత్సవం

నారాయణఖేడ్: ఖేడ్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈనెల 7న కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఉమా మహేశ్వర కల్యాణమహోత్సవం, కార్తీక దీపోత్సవం, మహాహారతి, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన నరసింహాచే సంగీత విభావరి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'ప్రజాతీర్పును స్వాగతిస్తున్నా'

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు ప్రజల తీర్పును స్వాగతిస్తున్నానని ఎన్ఎంఆర్ యువసేన అధ్యక్షుడు, బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆయా పార్టీలు టికెట్ కేటాయిస్తామని చెప్పి కాలయాపన చేశాయని, తక్కువ సమయంలోనే ప్రచారం చేసిన తనకు 46,059 ఓట్లు వచ్చాయన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు అధికారంలోనే ఉండాల్సిన అవసరం లేదని, తనను నమ్మి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ వాగులో మట్టి నింపడం సరికాదు

హుస్నాబాద్: ఎల్లమ్మ వాగులో వందలాది టిప్పర్లతో మొరం, నల్ల మట్టి నింపుతున్న వైనంపై విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశ్ డిమాండ్ చేశాడు. సోమవారం ఎల్లమ్మ వాగు బిడ్జి వద్ద పనులను సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మ వాగులో మట్టి నింపడం వల్ల చెరువు మత్తడి పడితే నీటి ప్రవాహ ఉధృతి పెరిగి సిద్దిపేట, హుస్నాబాద్ ప్రధాన రహదారైన పందిల్ల బ్రిడ్జి, చెక్‌డ్యాం తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. వాగులో కొంతమంది వ్యక్తులు మొరం, నల్లమట్టి పోసి పొలం పనులు చేపడుతున్నారని, దీనిపై తహసీల్దార్ విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ


ఎల్లమ్మ వాగును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నాయకులు సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, గూడ పద్మ, మల్లారెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో దళిత్ మార్చ్ టూ పార్లమెంట్ చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఢిల్లీ నుంచి ఫోన్ ద్వారా వారు 'సాక్షి'తో మాట్లాడారు. సామాజిక న్యాయ సాధనకు దళిత బహుజనులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి దళిత్ మార్చ్ టూ పార్లమెంట్ కార్యక్రమం ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. భారత రాజ్యాంగ హక్కులను అమలు చేయడానికి ప్రధాని మోదీ ప్రభుత్వం సిద్ధపడడం లేదని అసహనం వ్యక్తం చేశారు. భూ సంస్కరణలను అమలు చేయాలని


ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న డీబీఎఫ్ నాయకులు

డిమాండ్ చేశారు. దళితుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ఐక్యత చాటాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఏపీడబ్ల్యూయూ జాతీయ నాయకులు మట్టగల్ల వెంకటయ్య, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, టీవీవీయూ నాయకులు నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలే గెలిపించాయి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనపై విరక్తి చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సోమవారం సీపీఐ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల ముంగిటకు తీసుకుపోవడంతోనే కాంగ్రెస్ ప్రజలకు చేరువైందన్నారు. హుస్నాబాద్‌లో 10 ఏళ్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రజలు సతీశ్‌కుమార్‌ను ఓడించి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను గెలిపించారని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు కోసం సీపీఐ ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రవ్యాప్తంగా పని చేసినట్లు చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సమావేశంలో మండల కార్యదర్శులు గడిపె మల్లశ్, వనేష్, సంజీవరెడ్డి, గూడ పద్మ, కోయ్యడ పద్మ పాల్గొన్నారు.

కొమురవెల్లిలో బీఆర్ఎస్‌కు లీడ్

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో మొత్తం 17 పోలింగ్ కేంద్రాల్లో ఒక్క పోలింగ్‌స్టేషన్ మినహా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి 6,165 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి 4,909 ఓట్లు వచ్చాయి. మండలంలోని ఐనాపూర్‌లోని 13వ పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కంటే కాంగ్రెస్ అభ్యర్థికి 22 ఓట్లు అధికంగా వచ్చాయి. మండల కేంద్రంలో పల్లాకు అత్యధికంగా 361 ఓట్ల మెజార్టీ రాగా అత్యల్పంగా లెనిన్‌నగర్‌లో 23 ఓట్లు వచ్చాయి. మండలంలోని గురువన్నపేటలోని 18వ పోలింగ్ బూత్‌లోని ఈవీఎం మిషన్ కౌంటింగ్ కేంద్రంలో పని చేయకపోవడంతో వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించినట్లు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆపార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అరాచకం పెరిగిపోయిందన్నారు. ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలకు న్యాయం చేస్తుందని.. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పత్తిపై వర్ష ప్రభావం

మునిపల్లి(అందోల్): పత్తి పంటను రైతులు కూలీలతో తీయిస్తున్న సమయంలో తరచూ వర్షం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి, మన్‌సాన్‌పల్లి, కంకోల్, బుదేరా గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం వర్షం పడింది. దీంతో చేతికొచ్చిన పత్తి పంటపై నలుపువారి పనికి రాకుండా పోతోందని, పంట దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తెంపిన కూలీలకు కిలోకు రూ. 10 చొప్పున ఇస్తూ కూలీలు ఉండడానికి తాత్కాలికంగా నివాసం కోసం గుడారాలను ఏర్పాటు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

హైనా దాడిలో దూడ మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో దూడ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రైతు కనుగుల నాగరాజు పెద్దకోడూరు శివారులోని వ్యవసాయ భావి వద్ద రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి తన గేదెలను కట్టేసి, నాలుగు దూడలను జాలిలోకి తోలి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా ఒక దూడ గాయాలతో మృతి చెంది ఉంది. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, బీట్ ఆఫీసర్లు సుమన, శ్రీకాంత్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాలి ముద్రలు స్పష్టంగా గుర్తించలేకపోయినట్లు తెలి


దూడను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పారు. దూడపై దాడి చేసింది హైనా ఉండవచ్చని రైతులు అనుమానం వ్యక్తం చేశారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి


కోదండరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజేఎస్ నేతలు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాలు వెలకట్టలేనివని టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కోదండరాంను టీజేఎస్ జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది అమరులయ్యారని, రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పాలన సాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా కోకన్వీనర్ ప్రవీణ్, యూత్ విభాగం అధ్యక్షుడు స్వామి, నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న నందకిషోర్ శర్మ

కొండపాక(గజ్వేల్): చదువుతోనే సమాజంలో గుర్తింపు పొందుతామని మానవ హక్కుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ నందకిషోర్ శర్మ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సోమవారం నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల కంటే విద్యా దానం గొప్పదన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా బాధ్యులు, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు ఉప్పల రాజు, ఆర్య వైశ్య మాహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉప్పల పాండురంగం, కందూరి వెంకటేశం గుప్త, కాపర్తి రాజు, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతకం.. ఆ వంతెనలు!

- స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


చిల్వెర ఐబీ చౌరస్తా బ్రిడ్జి వద్ద రోడ్డుపై కానరాని స్పీడ్ బ్రేకర్లు

అల్లాదుర్గం(మెదక్): 161 హైవేలోని వంతెనలు ప్రాణాంతకంగా మారాయి. బ్రిడ్జిల కింద నుంచి ప్రయాణం అంటే నరకప్రాయంగా తయారైంది. అటు వైపు నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా, ఎన్ని ప్రాణాలు పోయినా హైవే అధికారులు, కాంట్రాక్టర్ మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల ప్రమాదంలో ఇద్దరు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారని, అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అల్లాదుర్గం మండలం రాంపూర్ బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో సీతానగర్ గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనతో ఆగ్రహించిన గ్రామస్తులు, ఆర్టీసీ బస్సు, హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ధ్వంసం చేశారు. జాతీయ రహదారిపై గంటల తరబడి రాస్తారోకో చేశారు. రెండు నిండు ప్రాణాలు బలి, ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించాలని గ్రామస్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అల్లాదుర్గం 161 జాతీయ రహదారి వెంబడి గడిపెద్దాపూర్, చిల్వెర ఐబీ చౌరస్తా, చిల్వెర, అల్లాదుర్గం , రాంపూర్, ముస్లాపూర్, ముప్పారం గ్రామాల వద్ద బ్రిడ్జిలు నిర్మించారు. అయితే ఆ బ్రిడ్జిల పైనా, రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గడిపెద్దాపూర్ వద్ద ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా ప్రతి బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

క్రీడాకారులు ప్రతిభను చాటాలి

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు ప్రతిభను చాటాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ అన్నారు. జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్ క్రీడాకారులకు సోమవారం క్రీడాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడల్లో రాణించే వారికి తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ అనంతరాములు చారి, క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి,


క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సభ్యులు విజయరేఖ, నవీన్, నాగేష్‌కుమార్, క్రీడాకారులు సందీప్, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

చిన్నశంకరంపేట(మెదక్): మోడల్ స్కూల్ దారిలో గుర్తు తెలియని ఆటో బోల్తాపడిన సంఘటన మండల కేంద్రం చిన్నశంకరంపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోడల్ స్కూల్ దారిలోకి వచ్చిన ఆటో రోడ్డు కిందకు పడిపోవడంతో బోల్తాపడింది. అర్ధరాత్రి సమయంలో సంఘటన జరిగినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఇదే సమయంలో జేసీబీ నిర్వాహకుల బైక్ కన్పించకుండా పోవడం, ఆటో కోసం సోమవారం రాత్రి వరకు కూడా ఎవరు రాకపోవడంతో అనుమానాలు నెలకొన్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ అహమ్మద్ మోహినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... నార్సింగి వడ్డెర కాలనీకి చెందిన గండికోట యాదగిరి (45) బైక్‌పై సోమవారం రాత్రి నార్సింగి వైపు వస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ టైర్లు వెళ్లడంతో తల చిద్రమై రోడ్డుకు అతుక్కుపోయింది. ఈ మేరకు నార్సింగి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని వీరన్న గూడ గ్రామంలోని భద్రకాళీసమేత వీరభద్రస్వామి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో అభిషేకాలు, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు చేశారు. దేవాలయ ఈఓ శశిధర్, నిర్వహకులు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద భక్తులు దీపాలను వెలిగించి మొక్కులను తీర్చుకున్నారు.


ఉమామహేశ్వర దేవస్థానంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం